సాక్షి
వనపర్తి
గురువారం ; 29 ; మే ; 2025



రూ.600 కోట్లకు పెంచుతాం

పంట రుణాలు రూ.600 కోట్లకు పెంచుతామని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 8లో ▸



పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉల్లి ధరలు గరిష్టంగా రూ.500 పెరిగాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.9 /22.8

రోజంతా ఆకాశం మేఘావృతం అవుతుంది. అప్పుడప్పుడు ఎండ కనిపిస్తుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి పోరాటం : సీపీఎం



పాన్‌గల్: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ నాయకులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీల్లో మిగతా వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, తరలింపులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు అర్హులైన పేదలకే అందాలని కోరారు. స్థానిక సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్, సభ్యులు భాస్కర్, భగత్, ఎం.వెంకటయ్య, భీమయ్య, వెంకటయ్య, జంబులయ్య పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ది మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 4వ తేదీన జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–13, అండర్–15, అండర్–17, అండర్–19, సీనియర్, వెటరన్ విభాగాల్లో సెలక్షన్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆ రోజు ఉదయం 9 గంటలకు కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్‌ను రిపోర్టు చేయాలని, మిగతా వివరాల కోసం 98480 85211, 98660 33377, 96189 75795, 98669 28835 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ, బీఎడ్ ఫలితాలను బుధవారం పీయూ వీసీ శ్రీనివాస్ విడుదల చేశారు. బీఫార్మసీ మొదటి సెమిస్టర్‌లో 5.52 శాతం, బీఎడ్ 3వ సెమిస్టర్‌లో 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కంట్రోలర్ ప్రవీణ తెలిపారు. ఫలితాలను పీయూ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు.

మొక్కలే మానవాళికి జీవనాధారం

ఎర్రవల్లి: మొక్కలే మానవాళికి జీవనాధారమని పదో బెటాలియన్ కమాండెంట్ జయరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి నీటి కుంట ఏర్పాటు కోసం కమాండెంట్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కుంటలను ఏర్పాటు చేసుకుంటేనే మొక్కలకు అవసరమైనప్పుడు నీటిని వినియోగించుకోవచ్చునని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ద్వారా రూ. 3లక్షల వ్యయంతో బెటాలియన్‌లో నీటి కుంటను ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే రాబోయే కాలానికి ఆక్సిజన్ అందుబాటులో ఉంటుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, ఆర్‌ఐ రాజేశం, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



‘జూరాల’ మరమ్మతు

రూ.10 కోట్లతో క్రస్ట్‌గేట్ల పనులు



జూరాల జలాశయంలో పనులు చేపడుతున్న కార్మికులు

- మొత్తం 62 గేట్లు.. మరమ్మతుకు గురైనవి 27
- ఇప్పటి వరకు పూర్తయినవి 20
- చుక్కనీరు బయటకు రాకుండా స్టాప్ బ్లాక్‌ల ఏర్పాటు
- ఆధునిక సాంతికేత వినియోగం

జూరాల జలాశయం వివరాలు..

మొత్తం క్రస్ట్‌గేట్లు 62	ఒక్కో గేట్ పొడవు 12 మీటర్లు
వెడల్పు 8.5 మీటర్లు	వంతెన పొడవు 927 మీటర్లు
ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు	

అమరచింత: అటు సాగు, ఇటు తాగునీటితో పాటు విద్యుదుత్పత్తికి ఉపయోగపడుతున్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన క్రస్ట్‌గేట్ల మరమ్మతులు కొనసాగుతున్నాయి. 2022, మార్చిలో పనులు ప్రారంభించిన అధికారులు వరదల సమయంలో నిలిపి వేసి మిగతా సమయంలో చేపడుతున్నారు. క్రస్ట్ గేట్లలో జలాశయం వైపు ఉన్న గేట్‌ను మొదట లాక్ చేసి ముందువైపు ఉన్న గేట్ మరమ్మతు చేపడుతున్నారు. ప్రస్తుతం జలాశయానికి స్వల్పంగా వరద వస్తుండటంతో గజ ఈతగాళ్ల సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. క్రస్ట్‌గేట్ల మరమ్మతుకు అప్పటి ప్రభుత్వం 2022లో రూ.10 కోట్లు మంజూరు చేయగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆధునిక సాంకేతికతను వినియోగించి ఒక్కొక్కటిగా మరమ్మతు చేస్తున్నారు. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని.. వరదలు వచ్చే సమయం వరకు మూడు క్రస్ట్‌గేట్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపడతామని పీజేపీ అధికారులు వెల్లడించారు.

ఏడాది పొడవునా..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాది పొడవునా గేట్ల నిర్వహణ చేపట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రాజెక్టుకు మొత్తం 62 క్రస్ట్‌గేట్లు ఉండగా.. ఇందులో 27 గేట్లు మరమ్మతుకు గురైనట్లు అధికారులు గుర్తించగా, ఇప్పటి వరకు 20 గేట్ల మరమ్మతులు పూర్తయాయ్యి. ఒక్కో గేట్ మరమ్మతుకు వారం నుంచి పది రోజుల సమయం పడుతుండగా.. 14 నెలలుగా పనులు కొనసాగతున్నాయి.

పనులు కొనసాగుతున్నాయి..

“జూరాల ప్రాజెక్టులోని మూడు క్రస్ట్‌గేట్ల వద్ద మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఏడు గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. జలాశయంలోని నీరు దిగువకు పారకుండా స్టాప్‌బ్లాక్‌ల ద్వారా గేట్లను లాక్ చేస్తూ పనులు చేపడుతున్నాం.

– వెంకటేష్, ఏఈ

నిరంతర పరిశీలన..



క్రస్ట్‌గేట్ల మరమ్మతును నిత్యం పర్యవేక్షిస్తూ మెకానిక్‌లకు తగిన సూచనలు చేస్తున్నాం. ఆధునిక టెక్నాలజీని వినియోగించి మరమ్మతులు చేపడుతున్నా.. వారికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తతతో పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జలాశయానికి వరదలు వచ్చే నాటికి మూడు గేట్ల మరమ్మతులు పూర్తవుతాయి.

– ఖాజా జుబేర్ అహ్మద్, ఈఈ, జూరాల ప్రాజెక్టు

బ్యాక్‌వాటర్‌లోకి వెళ్లి..

క్రస్ట్‌గేట్ల నుంచి నీరు లీకేజీ కాకుండా మెకానిక్‌లు ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో జలాశయంలోని గేట్ల వద్దకు వెళ్లి స్టాప్ బ్లాక్‌లు బాగు చేస్తున్నారు. దీంతో ముందుభాగంలోని గేట్లను ఎత్తి మరమ్మతులు చేసే సమయంలో జలాశయంలోని నీరు బయటకు రాకుండా నిలువరిస్తుందని ప్రాజెక్టు ఏఈ వివరించారు. అనుకున్న సమయానికి మరమ్మతులు పూర్తయితే ప్రాజెక్టులోని నిల్వనీటి వృథాను అరికట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి



రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కేఎల్ఐ, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి కేటగిరి–1 ప్రాధాన్యత కింద నిర్ధారించిన భూములను త్వరగా సేకరించి ఇరిగేషన్‌శాఖకు అప్పగించాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. జయన్న తిర్మలాపూర్‌లో 12.95 ఎకరాలు, రేవల్లి మండలం కేశంపేటలో 29.24 ఎకరాలు సర్వే చేసి పెగ్ మార్క్ చేయాలని, సర్వేయర్లను పంపించి వారంలో సర్వే చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రేమద్దుల డి–8, కర్నెతండా ఎత్తిపోతలకు సంబంధించిన భూ సేకరణ చేపట్టాలని సూచించారు. షాపూర్‌లో 28.32 ఎకరాలు, మల్కాపూర్‌లో 8.35 ఎకరాలు, పాల్కెపాడులో భూ సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. గణపసముద్రం, బుద్దారంలో 96 ఎకరాలకు అవార్డ్ పాసైనందున రైతులకు పరిహారం చెల్లింపులు జరిగేలా చూడాలని భూ సేకరణ అధికారిని ఆదేశించారు. ఖిల్లాఘనపురం మండలం అల్లమాయపల్లిలో 10 ఎకరాలు, మిల్కిమియాన్‌పల్లిలో 6 ఎకరాలు, తిర్మలాయపల్లిలో 23 ఎకరాలు సైతం కేటగిరి–1లో ఉన్నందున జూన్ చివరి నాటికి సర్వే చేపట్టి అవార్డ్ పాస్‌చేసి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి కావాలన్నారు. సర్వేయర్లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో భూ సేకరణ పూర్తి చేయాలని కోరారు. ఇక నుంచి ప్రతి వారం భూ సేకరణ పురోగతిపై సమీక్ష ఉంటుందని, పూర్తయిన నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో భూ సేకరణ ప్రత్యేక అధికారి, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్ఈ జె.శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజినీర్ మధుసూదన్‌రావు, ఏడీ సర్వే బాలకృష్ణ, ఇరిగేషన్ ఈఈ కేశవరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

రెండోవిడత రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలి..

జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామపంచాయతీల్లో రెండోవిడత భూ భారతి రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై చేయాల్సిన పనులను వివరించారు. మండలం నుంచి రెండు బృందాలు ఏర్పాటు చేసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సులు నిర్వహించాలన్నారు. భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించి వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా అక్కడే పరిష్కరించాలని సూచించారు. సదస్సుకు ఖాస్రా, చేసాల, ఆర్వోఆర్, ఇతర భూ రికార్డులు తీసుకెళ్లాలని, పార్ట్–బి కేసులు, ఆర్ఎస్ఆర్ కేసులు తప్పకుండా పరిశీలించాలన్నారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్ వంటి కేసులు సాధ్యమైతే అక్కడే పరిష్కరించాలని కోరారు. చట్టం అమలు, షెడ్యూల్‌లో ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం



ప్రజలకు అభివాదం చేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్, నాయకులు

వనపర్తి: బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ పని చేస్తోందని సంఘం రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన బీసీ జనభేరి మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమ కాంక్ష ఒక్కరోజులో సఫలీకృతం కాదని.. దీర్ఘకాలం పోరాడాలని, ఈ సమయంలో ఏళ్లుగా రాజ్యాధికారం అనుభవిస్తున్న వారు హేళన చేసినా, తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేసినా బెదిరేది లేదన్నారు. ఓ వైపు బీసీల హక్కుల కోసం పోరాడుతూనే ఈ ప్రాంత బిడ్డగా సమాజంలో వోటు చేసుకుంటున్న అవినీతిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధుల అలసత్వాన్ని ఎండగట్టేందుకు మరో అడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. ఓర్వలేని కొందరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనుదిరగనని, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోపు ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని.. లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ తమ అభ్యర్థులను నిలబెట్టి ప్రజల ఆశీర్వాదంతో గెలిపించుకునేందుకు వెనుకాడబోదన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి రావడంతో మైదానం జనకళను సంతరించుకుంది. బుల్లితెర కళాకారులు జానులిరి, జంగిరెడ్డి బృందం తమ ప్రదర్శనలతో అలరించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వనపర్తి విద్యావిభాగం/అమరచింత: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని రాష్ట్ర తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రానికి బడిబాట ప్రచార జాత చేరుకోగా యూటీఎఫ్ నాయకులు, సభ్యులు పెద్దఎత్తున బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. రాజీవ్ చౌక్, అంబేడ్కర్ చౌక్‌లో, సాయంత్రం అమరచింతలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు సంఖ్య పెంపునకు టీఎస్ యూటీఎఫ్‌తో పాటు తెలంగాణ పౌర స్పందన వేదిక కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు ఉన్నాయని.. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫాంలు అందించడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి ఫీజుల భారం నుంచి విముక్తి పొందాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలను ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయని, సంపాదనలో సగానికిపైగా చదువులకే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లతో పాటు ఒత్తిడి లేని బోధన అందుతుందని వివరించారు. జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి జిల్లా కార్యదర్శులు హమీద్, శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, అరుణ, అనసూయ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు భద్రోనేయ్య, రామన్‌గౌడ్, నారాయణ, గట్టయ్య, భీమయ్య, అమరచింతలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేపీఈ మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగమణి, కావ్య, ధనమూర్తి, అగ్రిప్ప, రాములు, కిరణ్, జీఎస్ గోపి, అజయ్, తౌఫిక్, అశోక్, రవి, ఎం.శ్రీనివాసులు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

పాన్‌గల్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పరిమళ, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. సాయినాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల వివరాల నమోదు రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలు, అసంక్రమిత వ్యాధుల వివరాల నమోదు, వ్యాక్సిన్ పంపిణీ చేయని జాబితాను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా, టీకాలు ఇప్పించడంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. పాలిచ్చే తల్లులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ జిల్లా మేనేజర్ పరశురాం, జిల్లా ఎన్‌సీడీ కో–ఆర్డినేటర్ చంద్రయ్య, సీహెచ్‌ఓ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాక్సిన్ నిల్వల వివరాలు పరిశీలిస్తున్న డా. పరిమళ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి డా. వంశీకృష్ణ

వీపనగండ్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందని జిల్లా నోడల్ అధికారి డా. వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కల్వరాల సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ముసురు వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లోని వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, మురుగు కాల్వల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. చిన్నారులను ఆస్పత్రులకు తీసుకొచ్చి క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీ సొబగులు

ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్న మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్ల/జడ్చర్ల టౌన్: పాలమూరు జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతోంది. ఇప్పటికే పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు చేయగా.. తాజాగా ఆర్‌జీయూకేటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ) బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలకు అనుబంధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు ట్రిపుల్ ఐటీ కళాశాల మంజూరైంది. ఇందుకు సంబంధించిన జీఓను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. కళాశాల పూర్తిస్థాయి క్యాంపస్ ఏర్పాటు కోసం దివిటిపల్లి వద్ద స్థల పరిశీలన సైతం అధికారులు పూర్తి చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ కళాశాల వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ స్థల పరిశీలనలో పాల్గొని.. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

మూడు కోర్సులతో ప్రారంభం

ట్రిపుల్ ఐటీ కళాశాల క్యాంపస్ పూర్తిస్థాయిలో నిర్మాణానికి స్థల పరిశీలన జరుగుతోంది. అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు తాత్కాలిక భవనం ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా బండమీదిపల్లి వద్ద ఉన్న పాత రెడ్డి హాస్టల్ భవనంలో తరగతులు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మూడు కోర్సులతో కళాశాల ప్రారంభించనున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ విద్యాసంవత్సరంలో ఒక్కో కోర్సులో 60 మంది చొప్పున 180 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కూడా కల్పించనున్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



జిల్లాకు మంజూరైన ట్రిపుల్ ఐటీ కళాశాల క్యాంపస్ కోసం జడ్చర్ల మండలం చిట్టెబోయిన్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 1లో 21.26 ఎకరాలు, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పరిధిలోని 20.06 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ స్థలం 44వ నంబర్ జాతీయ రహదారికి పక్కనే ఉంటుంది. ఇక్కడ ట్రిపుల్ ఐటీ కళాశాల క్యాంపస్ ఏర్పాటుతో జడ్చర్ల రూపురేఖలు మారనున్నాయి. జాతీయ రహదారికి ముఖద్వారంలా ఉన్న జడ్చర్ల మరింత అభివృద్ధి సాధించే అస్కారం ఉంది. జడ్చర్ల, మహబూబ్‌నగర్ శివార్లలోని జాతీయ రహదారి పక్కన కళాశాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

41.32 ఎకరాల్లో క్యాంపస్

■ ప్రస్తుతం చిట్టెబోయిన్‌పల్లి శివారు సర్వే నంబర్ 1లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నవాబుపేట మండలానికి తరలించనున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి గురుకుల పాఠశాలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు వేలాది విద్యార్థులకు విద్యనందిస్తూ వచ్చింది. అయితే ట్రిపుల్ ఐటీ కళాశాల మంజూరు కావడంతో.. గురుకుల పాఠశాల వేరే ప్రాంతానికి తరలించడం అనివార్యమైంది. నవాబుపేట మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు.



ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేయనున్న స్థలం

ఇచ్చిన హామీ నెరవేర్చా..



ఇప్పటికే పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు జీఓలు వచ్చాయి. అడ్మిషన్లు కూడా ఇవ్వనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ట్రిపుల్ ఐటీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడం గొప్ప విషయం. కళాశాల ఏర్పాటుకు పాతరెడ్డి హాస్టల్ భవనాన్ని పరిశీలించాం. ఈ కళాశాల పాలమూరు సిగలో మరో మణిహారంగా చేరనుంది.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

జడ్చర్లకు మహర్దశ..

జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి ట్రిపుల్ ఐటీ కళాశాల మంజూరు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్ శివార్లలో 41.32 ఎకరాల విస్తీర్ణంలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కన ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుకు ఎంతో కృషి చేశామని పేర్కొన్నారు.


గట్టు శివారులో దోసకాయ విత్తనాలు విత్తుతున్న రైతు కుటుంబం


చిన్నచింతకుంట మండలం గూడూర్‌లో పత్తి విత్తనాలు వేస్తూ..


అమ్మాపూర్‌లో..


కొత్తపల్లి శివారులో జొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

ముందస్తు మురిపెం..

- నైరుతి రుతుపవనాల రాకతో తొలకరి జల్లులు
- రోహిణి కార్తెలోనే విత్తనాలు విత్తుతున్న రైతులు

రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయనే నానుడి ఉంది. ఈ కార్తెలో విత్తనాలు విత్తుకుని పండించిన గింజలను రోట్లో వేసి దంచినా మెదగవు అని అంటారు. పంటకు తిరుగుండదనే నానుడి కూడా ఉంది. ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు పలుకరించడంతో రైతన్నలు రోహిణి కార్తెలోనే విత్తనాలు విత్తుకునే పనిలో పడ్డారు. గట్టు మండలంలో కీరదోస సాగులో బిజీగా మారారు. పత్తి విత్తనోత్పత్తి కోసం విత్తనాలను కూడా రైతులు విత్తుతున్నారు. ఉమ్మడి మద్దూరు, కోస్గి మండలాల్లో పచ్చజొన్న, పెసళ్లు, కంది సాగు చేస్తున్నారు. రోహిణి కార్తెలో జొన్నలు వేస్తే అధిక దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్, గూడూరు, అల్లీపూర్ గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. మరికొందరు రైతులు దుక్కులు దున్నుతున్నారు.

- గట్టు/మద్దూరు/కొత్తపల్లి/చిన్నచింతకుంట

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ బలవన్మరణం


సుజాత (ఫైల్)

రాజోళి: భర్తను, కుటుంబాన్ని కాదని వెళ్లిపోయిన మహిళ మళ్లీ ఇంటికి వచ్చినప్పటికీ ఆమె జీవింతం అర్ధాంతరంగా ముగిసింది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం రాజోళికి చెందిన ప్రతాప్ భార్య సుజాతకు గ్రామానికి చెందిన కుర్వ పుల్లన్నతో వివాహేతర సంబంధం ఏర్పడింది. వారు ఇద్దరు ఈ నెల 12న కుటుంబాన్ని వదిలి వెళ్లిపోగా.. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా ఈ నెల 25న సుజాత స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రావడంతో పోలీసులు ఆమెతో మాట్లాడారు. గ్రామానికి చెందిన పుల్లన్నతో తన ఇష్టపూర్వకంగా వెళ్లానని, పలు ప్రాంతాల్లో తిరిగిన అనంతరం వరంగల్‌లో కొన్నాళ్లు ఉన్నామన్నారు. ఈ క్రమంలో 27న ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. కానీ కుర్వ పుల్లన్న అదే రోజు ఎలుకల మందు తాగడంతో ఆయనను చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒకవైపు పుల్లన్న ఆత్మహత్యాయత్నం చేసుకోవడం, మరోవైపు కుటుంబ సభ్యులు బాధపడుతుండటంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి 9 ఏళ్ల కుమార్తె చందు ఉంది. ఘటనపై మృతురాలి తల్లి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం


మంజుల (ఫైల్)

అయిజ: ద్విచక్ర వాహనంపై నుంచి పడి వివాహిత మృతిచెందిన ఘటన అయిజ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన కుమ్మరి నర్సింహులు, తన కుమారుడు రామాంజనేయులు, కోడలు మంజుల (20) తో పాటు 8నెలల మనవడితో కలిసి బైక్‌పై బంధువుల గ్రామానికి బైక్‌పై బయల్దేరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా సోముల గూడూరు సమీపంలో మంజుల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారిపడింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలిపారు. మంజుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ.. ఇద్దరి దుర్మరణం



దేవరకొండ: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలానికి చెందిన ఈడమోని శ్రీశైలం(44), ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన ఈరెటి బచ్చయ్య(40) వరుసకు బంధువులు. శ్రీశైలం, బచ్చయ్య వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరిద్దరు కలిసి పశువులను కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై మంగళవారం మిర్యాలగూడకు వచ్చారు. త్రిపురారం వద్ద వారికి అవసరమైన పశువులను కొనుగోలు చేశారు. రాత్రి కావడంతో అక్కడే బసచేసి బుధవారం ఉదయం స్వగ్రామాలకు బయల్దేరారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణంలోని మనోజ్ థియేటర్ సమీపంలోకి రాగానే కొండమల్లేపల్లి నుంచి ఐరన్ లోడ్‌తో కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం, బచ్చయ్య తీవ్రంగా గాయపడ్డారు. శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందగా.. బచ్చయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు శ్రీశైలం కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రుణాలు రూ.600 కోట్లకు పెంచుతాం


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

- ఆదాయ పన్ను రిటర్న్స్ వందశాతం ఫైల్ చేస్తాం
- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆదాయపు రిటర్న్స్ వందశాతం ఫైల్ చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరు నెలలలోపే రూ.300 కోట్లు వ్యవసాయ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. భవిష్యత్‌లో రూ. 600 కోట్లకు వ్యవసాయ రుణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలతో నిర్వహించిన సమావేశానికి చైర్మన్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనారాహిత్యం కారణంగా జిల్లాలో ఇంకా 46 సొసైటీలు ఇన్‌కమ్ టాక్స్ ఫైల్స్ రిటర్న్స్ చేయలేదన్నారు. ప్రస్తుతం వచ్చిన చట్టాలకు అనుగుణంగా రిటర్న్స్ ఫైల్ చేయడం కోసం సొసైటీల చైర్మన్లు, సీఈఓలకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తాము నిర్వహించబోయే బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఈ విషయం గురించి చర్చిస్తామని, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని అన్నారు. ఇప్పటికే ఇన్‌కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ నుండి నోటీసులు అందుకున్న వారు రిటర్న్స్ ఫైల్ చేయడంలో నిమగ్నమయ్యారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులకు ఇళ్ల నిర్మించుకోవడానికి, తమ పిల్లలను ఉన్నత చదువు చదివించుకోవడానికి, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసుకోవడానికి అవసరమైన రుణాలను మంజూరు చేస్తామని వెల్లడించారు. రుణ సదుపాయాన్ని పెంచుకోవడం ద్వారానే బ్యాంకుకు ప్రగతి నెలకొంటుందని అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లురవి, జిల్లాలోని ఎమ్మెల్యేలు తమ బ్యాంకు అభివృద్ధికి తమ శాయశక్తులా సహకరిస్తున్నారని, ఇటీవల బ్యాంకును సందర్శించిన నాబార్డు బృందం బ్యాంకు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, ఇన్‌కామ్ టాక్స్ అదనపు కమీషనర్ వంశీకృష్ణ, మహబూబ్‌నగర్ వార్డు–1 ఆఫీసర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పశువుల చోరీ కేసును ఛేదించిన పోలీసులు


ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో పశువుల దొంగలతో సీఐ రాంబాబు, ఎస్ఐ సురేష్‌గౌడ్, సిబ్బంది

ఖిల్లాఘనపురం: వ్యవసాయ పొలాల్లోని పశువుల పాకల్లో ఉన్న పశువులను రాత్రివేళలో దొంగలు తీసుకెళ్లారు. ఈ కేసును ఖిల్లాఘనపురం పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ఛేదించారు. బుధవారం కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాఘనపురం ఎస్ఐ సురేష్‌గౌడు పట్టుకున్న దొంగలను మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. ఖిల్లాఘనపురం మండలంలోని షాపురం గ్రామానికి చెందిన రైతులు కర్నె తండాకు వెళ్లే రోడ్డుకు దగ్గరలో ఉన్న పశువుల పాకలో ఉన్న 8 ఎద్దులు, ఒక ఆవును ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున దొంగలు తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన మామిళ్ల మాసయ్య, భీమయ్య, వెంకటయ్య, నాగన్నలు ఎద్దులు పోయినట్లు ఫిర్యాదు చేయడంతో నాటి నుంచి ఎస్పీ రావుల గిరిధర్ పర్యవేక్షణలో ఎద్దులను తీసుకెళ్లిన దొంగల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం మండలంలోని తిర్మలాయపల్లి గేట్ దగ్గర వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో నిందితులను పట్టుకున్నట్లు వారు తెలిపారు. తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానం రావడంతో మహ్మద్ సిరాజ్, మహ్మద్ ఆమెర్ ఖురేషీలను పట్టుకుని విచారణ చేయగా, వారు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. 27న మరో మారు గ్రామాల్లో దొంగతనం చేసేందుకు మరో ముగ్గురు వ్యక్తులు హస్మత్, రఫీక్ ఉద్దీన్, షాహబాజ్‌లతో కలిసి మండలానికి వచ్చినట్లు తెలిపారు. పశువులకు ఇచ్చే మత్తు ఇంజక్షన్ కోసం ముగ్గురు వెళ్లి ఎంతకు తిరిగి రాలేదు. దీంతో సిరాజ్, అమోర్‌లు బుధవారం మండలం నుంచి వాహనంలో తిరిగి వెళ్తున్న సమయంలో తనిఖీలో పట్టుపడ్డారని చెప్పారు. వీరు షాపురం గ్రామంలో 8 ఎద్దులు, ఒకటి ఆవును తీసుకెళ్లడం జరిగిందని ఒప్పుకోవడం జరిగిందన్నారు. పశువులను హైదరాబాద్ తీసుకెళ్లి రూ.1.80 లక్షలకు అమ్మినట్లు విచారణలో తెలిపారు. నిందితుల నుంచి దొంగతనానికి వాడిన ఆటోను, ఓ కారు, రూ.1.80 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనం కేసును ఛేదించిన ఖిల్లాఘనపురం ఎస్ఐ సురేష్‌గౌడు, సిబ్బంది పి.లింగం, బి.రాజు, చైతన్య కుమార్, ఎండీ మునావర్‌లను సీఐ అభినందించారు.

మహబూబ్‌నగర్‌కు మరో విజయం

- ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లో వనపర్తిపై ఇన్నింగ్స్ గెలుపు


డేవిడ్ క్రిపాల్ (111 పరుగులు నాటౌట్)


ఎ.శ్రీకాంత్ (105 పరుగులు)


ముఖితుద్దీన్ (9 వికెట్లు)

మహబూబ్‌నగర్ క్రీడలు: అండర్–23 పురుషుల ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. జిల్లాకేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో బుధవారం మహబూబ్‌నగర్–వనపర్తి జట్ల మధ్య లీగ్ జరిగింది. మహబూబ్‌నగర్ జట్టు ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో వనపర్తి జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 47 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 315 పరుగులకు డిక్లేర్ చేసింది. జట్టులో డేవిడ్ క్రిపాల్, ఎ.శ్రీకాంత్ సెంచరీలతో రాణించారు. డేవిడ్ క్రిపాల్ 93 బంతుల్లో 6 సిక్స్‌లు, 9 ఫోర్లతో 111 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా.. ఎ.శ్రీకాంత్ 94 బంతుల్లో 1 సిక్స్, 15 ఫోర్లతో 105 పరుగులు చేశాడు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 171 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. వనపర్తి బౌలర్లు చరణ్ 2, షోయబ్ 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన వనపర్తి జట్టు పాలమూరు బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 27.2 ఓవర్లలో 77 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ బౌలర్ ముఖితుద్దీన్ 10.2 ఓవర్లలో 23 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీశాడు. ఇతర బౌలర్లు అభినవ్ 2, కొండ శ్రీకాంత్, శశాంక్ చెరో వికెట్ తీశారు. ఫాలోఆన్ రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన వనపర్తి 33.3 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మహేష్ నాయక్ 54 బంతుల్లో 8 సిక్స్‌లు, 4 ఫోర్లతో 79 పరుగులు చేశాడు. డేవిడ్ క్రిపాల్ 4, ముఖితుద్దీన్ 3, ఎ.శ్రీకాంత్ 2 వికెట్లు తీశారు. మరోరోజు ఉండగానే పాలమూరు జట్టు విజయం సాధించడం విశేషం. ఇన్నింగ్స్ తేడాతో మ్యాచ్‌ను గెలుపొందడంతో మహబూబ్‌నగర్ జట్టు బోనస్‌పాయింట్‌తో కలిపి ఆరు పాయింట్లు సాధించింది.

గెలుపు, ఓటమిని స్ఫూర్తిగా తీసుకోవాలి

క్రికెట్‌లో గెలుపు, ఓటములను జట్లు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోశాధికారి ఉదేశ్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్–వనపర్తి టూడేలీగ్ మ్యాచ్‌ను తిలకించారు. వారు మాట్లాడుతూ ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం పట్టుదలతో ఆడాలని కోరారు. రానున్న లీగ్ మ్యాచుల్లో కూడా క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో మ్యాచ్ పరిశీలకుడు రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్‌లో ధన్వాడ విద్యార్థి ప్రతిభ


కంచు పతకంతో శివకుమార్

ధన్వాడ: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ధన్వాడకు చెందిన శివకుమార్ ప్రతిభ చాటాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు 31వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొన్న ధన్వాడ గ్రామానికి చెందిన కె.శివకుమార్ ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచి కంచు (బ్రాంజ్) పతకం సాధించినట్లు కోచ్ డాక్టర్.రామ్మోహన్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పల్కపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెర్ముల సురేష్ (30) ఈనెల 24న అచ్చంపేట నుంచి స్వగ్రామానికి స్కూటీపై వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

భారీ సైబర్ మోసం

వృద్ధురాలి నుంచి రూ.17 లక్షలు కాజేసిన వైనం



మహబూబ్‌నగర్ క్రైం: సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. విభిన్న పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తూ డబ్బులు కాజేస్తున్నారు. తాజాగా జిల్లాకేంద్రంలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ బుధవారం వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలి పిల్లలు ఇతర దేశాల్లో స్థిరపడగా.. ఇంట్లో ఆమె ఒక్కతే ఉంటోంది. ఈ నెల 23న గుర్తు తెలియని వ్యక్తులు సదరు వృద్ధురాలికి వాట్సాప్ కాల్‌చేసి మేము ముంబై పోలీసుశాఖ నుంచి మాట్లాడుతున్నామని.. మీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైందని బెదిరించారు. చట్ట విరుద్ధమైన ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొన్నారని.. సహకరించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే విదేశాల్లో ఉన్న పిల్లల పాస్‌పోర్టులు సైతం రద్దు చేస్తామని చెప్పగా భయపడి రూ.11 లక్షల నగదును వారి ఖాతాలో జమ చేసింది. అదేవిధంగా మంగళవారం మళ్లీ మహిళకు వీడియోకాల్ చేసి న్యాయమూర్తి మాదిరిగా మాట్లాడి బెయిల్‌కు డబ్బులు కావాలని చెప్పడంతో రూ.6 లక్షలు జమ చేసింది. కాసేపటి తర్వాత మళ్లీ ఫోన్ చేసి ఇంకా రూ.25 లక్షలు కావాలని డిమాండ్ చేయగా మోసపోయినట్లు గుర్తించి బుధవారం ఫిర్యాదు చేసిందని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి పోలీసులమని చెబితే భయపడొద్దని.. బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు, చెప్పొద్దన్నారు. సైబర్ బారిన పడితే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పత్తి విత్తన వ్యాపారి అరెస్ట్

జడ్చర్ల: ప్రభుత్వం నిషేధించిన బీజీ–3 పత్తి విత్తనాలు పలు గ్రామాల్లో రైతులకు, తదితర వ్యాపారులకు సరఫరా చేసిన పత్తి విత్తన వ్యాపారిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. షాద్‌నగర్‌కు చెందిన వ్యాపారి సత్యపాల్‌రెడ్డిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇటీవల మండలంలో తనిఖీ చేయగా పట్టుబడిన బీజీ–3 పత్తి విత్తనాలను సరఫరా చేసిన వ్యాపారులపై ఆరా తీస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పత్తి విత్తన వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కృష్ణ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణ మండల పరిధిలోని గుడేబల్లూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వడ్డే అంజప్ప (36)పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గ్రామ శివారుకు రాగానే గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు 13,137 క్యూసెక్కుల వరద

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి బుధవారం సుంకేసుల నుంచి 13,137 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 817.4 అడుగుల వద్ద 38.9725 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,360 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 4.667 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి దిగువన సాగర్‌కు 10,096 క్యూసెక్కుల నీటిని తరలించారు.

రామన్‌పాడు ద్వారా 42 క్యూసెక్కుల వినియోగం


మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తి స్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు గాను 1,016 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. కుడి, ఎడమ కాల్వ ద్వారా 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రెండు గేట్ల నుంచి నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాం ద్వారా రెండు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 8,917 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లు తెరిచి 8,758 క్యూసెక్కులను దిగువకు, 159 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు ఆయన తెలిపారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ. 2100
- కనిష్టంగా రూ. 1700



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలంలో ధరలు స్వల్పంగా పెరిగాయి. సీజన్ తగ్గడంతో ధరలు పెరగడం ప్రారంభమైంది. గతవారంతో పోల్చితే గరిష్ట కనిష్ట ధరలు రూ.500 వరకు పెరిగాయి. వర్షాలు కురుస్తుండడంతో మార్కెట్‌కు తక్కువ మొత్తంలో ఉల్లి అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో ఉదయం పది గంటలకు ఉల్లి వేలం ప్రారంభం కాగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు, స్థానిక వ్యాపారులు ఉల్లిని కొనడానికి పోటీ పడ్డారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నిల్వ చేసుకునే అవకాశం ఉండడంతో వినియోగదారులు మార్కెట్‌కు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. చాలా మంది రైతులు వేలం వేయకుండానే నేరుగా వినియోగదారులకు బస్తాలుగా చేసి అమ్ముకున్నారు. మార్కెట్ బయట కూడా రైతులు ఉల్లి విక్రయాలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్‌లో, మార్కెట్ బయట సందడిగా కనిపించింది.

బస్తా ధర రూ.1050

దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన ఉల్లి బహిరంగ వేలంలో గరిష్టంగా రూ. 2100, కనిష్టంగా రూ. 1700 గా ధరలు వచ్చాయి. 50 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ. 1050, కనిష్టంగా రూ. 800లకు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు వేయి బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది.

మహిళపై దాడి: కేసు నమోదు

గద్వాల క్రైం: గేదెలు మేపడానికి తీసుకెళ్లిన ఓ మహిళను అకారణంగా దూషించి, విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనలో బాధ్యుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన దళిత మహిళ లక్ష్మి మంగళవారం ఉదయం గేదెలు మేపేందుకు శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులోకి తీసుకెళ్లి.. సాయంత్రం ఇంటికి వస్తుండగా విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి గేదెలు వెళ్లాయని ఆమెతో అకారణంగా దూషణకు పాల్పడ్డాడు. వారించేందుకు ప్రయత్నం చేసే క్రమంలో సహనం కోల్పోయి లక్ష్మి ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి అసభ్య పదజాలంచ కులం పేరుతో దూషించాడు. దాడి చేసిన క్రమంలో సదరు మహిళ పళ్లు ఊడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే బుధవారం బాధితురాలి భర్త నర్సింహులు ఫిర్యాదు మేరకు శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

దళిత మహిళ లక్ష్మిపై విష్ణువర్ధన్‌రెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అని కుల సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మాచర్ల ప్రకాష్ అన్నారు. గతంలోనూ అదే గ్రామానికి చెందిన పలువురితో ఇలాంటి ఘటనలు, పంచాయితీలు జరిగినట్లు పేర్కొన్నారు. అంతకుముందు బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రభుత్వం మహిళ కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు.

చిన్నారిపై కుక్క దాడి


కుక్కకాటుకు గురైన దీపిక

వీపనగండ్ల: మండల కేంద్రంలో దీపిక అనే చిన్నారిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. తూంకుంట గ్రామానికి చెందిన కడతల విజయ్, నాగమణి దంపతుల కుమార్తె దీపిక వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరైన వీపనగండ్లకు వచ్చింది. బుధవారం ఇంటి ఆవరణలో తోటి చిన్నారులతో ఆటకుంటుండగా.. సమీపంలోని కుక్క దాడి చేయడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత చిన్నారికి స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికమైందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.